క్లుప్తంగా

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం



జాబితాను ఇన్‌చార్జి తహసీల్దార్‌కు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చింతలపూడి: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటడానికి వైఎస్సార్ సీపీ సిద్ధంగా ఉందని పార్టీ పట్టణ అధ్యక్షుడు కొప్పుల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఎస్ దుర్గారావు తెలిపారు. సోమవారం చింతలపూడి నగర పంచాయతీలోని 21 వార్డుల బీఎల్ఓల జాబితాను ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎస్‌కే షకీలా బేగంకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగర పంచాయతీలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. పార్టీ ఆదేశాల మేరకు జాబితాలను తహసీల్దార్ కార్యాలయంలో అందచేసినట్లు చెప్పారు.

విద్యుత్ కోతలపై ధర్నా



నామవరం సబ్‌స్టేషన్ వద్ద గ్రామస్తుల ధర్నా

చింతలపూడి: కరెంట్ కష్టాలు తీర్చాలని కోరుతూ నామవరం గ్రామస్తులు సోమవారం రాత్రి సబ్ స్టేషన్ ముందు ధర్నా చేశారు. గత 20 రోజులుగా గ్రామంలో విద్యుత్ సరఫరా సరిగా ఉండటం లేదని గ్రామస్తులు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు వచ్చిందని అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా శాశ్వత చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు బోడ రమేష్, బోడ తేజ ఆరోపించారు. కరెంట్ లేక దోమలు, ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.

ఎన్జీవో నేతలకు సత్కారం



పోలవరం తాలూకా ఏపీ ఎన్జీవో నాయకులను అభినందిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: ఏపీ ఎన్జీవోస్ కొయ్యలగూడెం యూనిట్ ఎన్నికలు మంగళవారం నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు పి శ్రీనివాసరావు, కే స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్తు కార్యాలయంలో ఉదయం పది గంటల నుంచి ఎన్జీవో నాయకులు వై.నరేష్ ఆధ్వర్యంలో గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు ఎన్నికలు ఏర్పాటు చేశామన్నారు. కాగా పోలవరం తాలూకా ఏపీ ఎన్జీవోస్ కార్యవర్గ నాయకులను పీహెచ్‌సీ వద్ద సత్కరించారు. అధ్యక్షుడిగా నియమితులైన ఎస్ఆర్‌పీపీ మార్రాజు, జి.బాలకృష్ణ, నాగరాజు తదితరులను అభినందించారు.

పింఛను ఇప్పించాలని వినతి



బుట్టాయగూడెం ఎంపీడీఓ కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: అర్హత ఉన్నా తమకు పింఛను మంజూరు చేయడం లేదని మండలంలోని రెడ్డిగణపవరంనకు చెందిన మహిళలు సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన శివుడు సావిత్రి మాట్లాడుతూ తన భర్త వెంకటస్వామి చనిపోయి ఆరేళ్లయిందని తనకు ఇంతవరకూ పింఛను మంజూరు కాలేదని చెప్పారు. అదేవిధంగా భర్తలు చనిపోయిన కొలుకూరి వెంకటరత్నం, దంపనబోయిన అన్నపూర్ణ సైతం తమకు ఏ ఆధారం లేదని, పింఛను మంజూరు కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేవీపీఎస్ నాయకులు అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ పింఛను మంజూరు చేసి వెంటనే వారిని ఆదుకోవాలని కోరారు. అనంతరం వినతిపత్రాన్ని ఎంపీడీఓ ఏఓ బేబీ సరోజినికి అందజేశారు.

ప్రభాకరశర్మకు సత్కారం



దోర్బల ప్రభాకరశర్మను సన్మానిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: హిందుత్వమే సృష్టికి రక్షణ అని సనాతన ధర్మాన్ని పాటించడం సర్వమానవాళికి శ్రేయస్కరం అని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త దోర్బల ప్రభాకర్ శర్మ పేర్కొన్నారు. సోమవారం వాసవి ఆడిటోరియంలో ఆయన ప్రజలకు అనుగ్రహ భాషణ చేశారు. ప్రాంతీయ బ్రాహ్మణ యువ శక్తి సంఘంచే నిర్వహించబడిన హిందుత్వం–సనాతన ధర్మం అనే అంశాలపై వేదాల్లో దాగిఉన్న అంశాల గురించి వివరించారు. భారతదేశం వేద భూమి అని, ప్రపంచానికి వేదమాత వంటిదని వ్యాఖ్యానించారు. ప్రభాకర శర్మను భక్తులు, అర్చక సంఘం, బ్రాహ్మణ యువజన సంఘం ఘనంగా సత్కరించింది.

రైతులకు అండగా వైఎస్సార్ సీపీ పోరు

అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరించిన నేతలు



కామవరపుకోట: అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కంభం విజయరాజు, స్థానిక నేతలు



చింతలపూడి: ఫాతిమాపురంలో వైఎస్ విగ్రహం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం



ద్వారకాతిరుమల: కాపు కల్యాణ మండపంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కామవరపుకోట: రైతుల హక్కుల కోసం పోరాడే పార్టీ వైఎస్సార్‌సీపీ అని ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు అన్నారు. మండలంలో సాగిపాడు గ్రామపంచాయతీలో నిర్వహించిన కార్యక్రమంలో ఈనెల 9న చేపట్టనున్న అన్నదాత పోరు పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రైతుల పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు ప్రతి గ్రామంలోనూ రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేసి రాయితీల ద్వారా ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ పనిముట్లు అందజేశారన్నారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ప్రతి పథకాన్ని అందజేసిన ఘనత వైఎస్సార్‌సీపీదేనని అన్నారు. అన్నదాత పోరు కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. తొలుత మండల రాయౌకుల సత్యనారాయణ ఆధ్వర్యంలో దేవరపల్లి రామ్మోహన్‌రావు పరిశీలకులుగా సాగిపాడు గ్రామపంచాయతీ రత్నగిరి, వీరంపాలెం గ్రామ కమిటీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షునిగా వీరంపాలెం మురళిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆలపాటి బాలకృష్ణ, బొప్పన దుర్గారావు, సర్పంచ్ గుండుగోల సుబ్బారావు, ఎంపీటీసీ బూరుగు శ్రీను, నాగరాజు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

చింతలపూడి: రైతన్నలకు అండగా నిలిచేందుకు వైఎస్సార్ సీపీ అన్నదాత పోరు కార్యక్రమాన్ని చేపట్టినట్లు వైఎస్సార్ సీపీ జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్వరరావు అన్నారు. చింతలపూడి పట్టణ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం అన్నదాత పోరు పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సమస్యలను పరిష్కారంలో కూటమి సర్కారు ఘోరంగా విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొప్పుల నాగేశ్వరరావు, చిలుకూరి జ్ఞానారెడ్డి, త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, కే చండీప్రియ, మిరియాల దిలీప్, గణిజెర్ల సర్పంచ్ వెంకటరావు, గోపాలకృష్ణ, కే అజయ్ రెడ్డి,గోలి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహం వద్ద పోస్టర్ ఆవిష్కరణ

చింతలపూడి: ఈనెల 9న తలపెట్టిన అన్నదాత పోరును విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు జగ్గవరపు జానకి రెడ్డి పిలుపునిచ్చారు. ఫాతిమాపురం గ్రామంలోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద సోమవారం మండల పార్టీ ఆధ్వర్యంలో అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు శీలపురెడ్డి రమేష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జానకిరెడ్డి మాట్లాడుతూ అన్నదాత పోరు కార్యక్రమానికి నాలుగు మండలాల నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, రైతులు హాజరుకావాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎరువులు సరఫరా చేయకుండా అన్యాయం చేస్తుందని విమర్శించారు. యూరియా సహా రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు తక్షణం సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎస్ రమేష్ రెడ్డి, జెడ్పీటీసీ ఎం నీరజ సుధాకర్, మండల పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ బి రాంబాబు నాయక్, ప్రగడవరం సర్పంచ్ టి భూపతి, గొంది రాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుక్కునూరులో...

కుక్కునూరు: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం జంగారెడ్డిగూడెం పట్టణంలో నిర్వహించనున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తాంత్ర రాజేష్ పిలుపునిచ్చారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన మండల నాయకులతో కలిసి అన్నదాత పోరు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా తాంత్ర రాజేష్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతులకు కష్టాలు మొదలైయ్యాయన్నారు. పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర కల్పించలేదని, రైతులకు కనీసం ఎరువులను కూడా అందించలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు రాయి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ గాడిద రామచంద్రం , నాయకులు రావు వినోద్, చేకూరి నవీన్‌వర్మ, మల్లెల చంటినాయుడు, పగిళ్ల అల్లేష్, ఆలేటి కాశ్యాచారి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు తీరని అన్యాయం

ద్వారకాతిరుమల: అన్నదాతలకు కూటమి ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, పార్టీ నియోజకవర్గ మేధావుల ఫోరమ్ అధ్యక్షుడు పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు ధ్వజమెత్తారు. ద్వారకాతిరుమలలోని కాపు కల్యాణ మండపంలో సోమవారం అన్నదాత పోరు పోస్టర్‌ను పార్టీ నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ పంటలకు కావాల్సిన ఎరువులు, యూరియాను రైతులకు అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించి, ఎరువులను పక్కదోవ పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, పోలకంపల్లి అనీల్, ప్రత్తిపాటి యోహాను, బాలం వెంకటేశ్వరరావు, దొప్పసాని రాధాకృష్ణ, వైస్ ఎంపీపీ యలమర్తి దుర్గాదేవి, బిరుదుగడ్డ బజారయ్య మానుకొండ కన్నయ్య, షేక్ మస్తాన్ బాషా, యాచమనేని నాగేశ్వరరావు,, అచ్యుత ఏసుబాబు, ఉక్కుర్తి వెంకట్రావు, పానమాల ఉమామహేశ్వరరావు, రుద్ర శివాజీ, బొంతు శ్రీను తదితరులున్నారు.

భారీగా తరలిరండి

టి.నరసాపురం: జంగారెడ్డిగూడెంలో మంగళవారం జరిగే అన్నదాత పోరు కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలి వెళ్లాలని వైఎస్సార్ సీపీ టి.నరసాపురం మండలం కన్వీనర్ శ్రీను రాజు పిలుపునిచ్చారు. దేవరపల్లి ముత్తయ్య నివాస గృహం వద్ద సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనురాజు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వాసిరెడ్డి మధు మాట్లాడుతూ రాష్ట్రానికి 15 నెల క్రితమే చంద్రగ్రహణం పట్టిందని విమర్శించారు. రైతులకు అవసరమైన ఎరువులను అందించాలని పండిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సహకార సంఘాల మాజీ చైర్మన్ దేవరపల్లి ముత్తయ్య, కాల్నీడి సుబ్బారావు, కాల్నీడి రమేష్, వంటిపల్లి సుబ్రహ్మణ్యం, కాల్నీడి జగన్, దాకారపు సూరిబాబు, కటకం మల్లికార్జునరావు, నల్లూరి శ్రీనివాస్, జెసిబి శ్రీను, బొడ్డు శ్రీను, డేవిడ్, కొల్లి పురుషోత్తం, బంధంచర్ల సర్పంచ్ జి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అయ్యపరాజుగూడెంలో...

లింగపాలెం: ఈ నెల 9వ తేదీన జంగారెడ్డిగూడెంలో జరిగే అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు అన్నపనేని శాంతారావు పిలుపునిచ్చారు. సోమవారం అయ్యపరాజుగూడెంలో అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం రైతు సమస్యలపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని, ఈ నేపథ్యంలో రైతులకు అండగా ఉండేందుకు వైఎస్సార్ సీపీ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్దెత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మండల యూత్ ప్రెసిడెంట్ చీదరాల ప్రసాద్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

కామయ్యపాలెంలో...

బుట్టాయగూడెం: ఎరువుల బ్లాక్ మార్కెటింగ్‌పై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జీలుగుమిల్లి మండల అధ్యక్షుడు చందా ప్రసాద్ పిలుపునిచ్చారు. కామయ్యపాలెంలో సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర సమాచార హక్కు చట్టం కార్యదర్శి తగరం రాంబాబు, గ్రామాధ్యక్షుడు బోడిక భోగేశ్వరరావు, ఉప్పల రాంపండు, ఉపాధ్యక్షుడు దొడ్డకుల జగదీష్, నాయకులు బొంతు వెంకటరావు, ఆకుల రవి, గుర్రాల సుధాకర్, కట్టూరి కృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

యూరియా కొరతను పరిష్కరించాలి



అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెట్టి గురునాథరావు, పార్టీ నేతలు

జంగారెడ్డిగూడెం: రైతులు ఎదుర్కొంటున్న యూరియా కొరతను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, మచిలీపట్నం పార్లమెంట్ పరిశీలకుడు జెట్టి గురునాథరావు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో అన్నదాత పోరు పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మంగళవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపడుతున్న అన్నదాత పోరు కార్యక్రమానికి అధిక సంఖ్యలో రైతులు, ప్రజలు తరలి వచ్చేలా నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలన్నారు. అబద్ధపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను మభ్య పెట్టి మోసం చేస్తూ కాలం గడుపుతుందన్నారు. ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేసే ఆలోచన కూటమి ప్రభుత్వానికి లేదన్నారు. ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేసుతన్నారన్నారు. నేటి వరకు ఏ ఒక్క కార్యక్రమం సక్రమంగా అమలు చేయలేదన్నారు. ముఖ్యంగా వ్యవసాయ రంగంపై చంద్రబాబు నిర్లక్ష్య వైఖరి స్పష్టంగా కనిపిస్తోందన్నారు. రబీ సీజన్ ప్రారంభమైనా పంటకు అవసరమైన యూరియాను రైతులకు అందుబాటులో ఉంచడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో మండల, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఓరుగంటి నాగేంద్ర, కర్పూరం గుప్త, పంచాయతీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్నీడి బాబి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శులు కుక్కల ధర్మరాజు, గురజాల పార్థసారధి, జిల్లా కార్యదర్శి ముప్పిడి శ్రీను, వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, పీపీఎస్ చంద్రరావు, పట్టణ ప్రధాన కార్యదర్శులు చిప్పాడ వెంకన్న, చిత్తపురి శేఖర్, వీరవల్లి సోమేశ్వరరావు, మహ్మద్ కబీర్, కళ్యాణ వర్మ, ఎ.సుబ్రమ్మణ్యం, మండల నాయకులు పాల్గొన్నారు.



చింతలపూడి: పట్టణ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు



కుక్కునూరు: అన్నదాత పోరు కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు



టి.నరసాపురం: పోస్టర్‌ను ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ నాయకులు



లింగపాలెం: అయ్యపరాజుగూడెంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శాంతారావు, నేతలు



బుట్టాయగూడెం: కామయ్యపాలెంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

వ్యాయామ ఉపాధ్యాయులకు అభినందనలు



జెడ్పీ బాలుర హైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయులను అభినందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల జంగారెడ్డిగూడెం నందు కొయ్యలగూడెం జోన్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో స్కూల్ గేమ్స్ మండల స్థాయి క్రీడాల నిర్వహణ, డివిజన్ స్థాయి క్రీడా నిర్వహణ గురించి ఉపాధ్యాయులు చర్చించారు. వ్యాయామ ఉపాధ్యాయులుగా పని చేస్తూ ఉన్నత స్థానాలను చేరుకున్న పేరం రవీంద్రనాథ్, కొవ్వాసు జగదీశ్వరి, బి.జాన్సన్, పీఎస్ సుధాకర్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కొయ్యలగూడెం వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడిగా జి.హనుమంతరావు, సెక్రటరీగా ఎం.కామేశ్వరి, కోశాధికారిగా శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఏపీసీ, తహసీల్దార్, ఎంపీడీవో

లింగపాలెం: తల్లిదండ్రుల తరువాత అంతటి ప్రాధాన్యం ఉపాధ్యాయులదేనని ఏలూరు జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ సమన్వయ అధికారి పంకజ్ కుమార్ అన్నారు. లింగపాలెం మండలంలోని విద్యా వనరుల కేంద్రంలో సోమవారం పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి గురుపూజోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సేవా దృక్పథంతో సేవలందిస్తున్న 12 మంది ఉపాధ్యాయులను ఏపీసీ పంకజ్ కుమార్, తహసీల్దార్ నజీముల్లా, ఎంపీడీవో వాణి , విద్యాశాఖ అధికారులు రామారావు, రవీంద్ర చేతుల మీదుగా దుశ్శాలువాలతో సన్మానించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీలింగ్ భూములు పేదలకు పంపిణీ చేయాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ధర్నా

కొయ్యలగూడెం: మంగపతిదేవిపేట పంచాయతీ బుల్లింపేట సమీపంలోని మిగులు సీలింగు భూములను అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని సోమవారం స్థానిక తహసీల్దర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. నవ్యాంధ్ర ప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ రెడ్ స్టార్ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నకూటి వెంకటేశ్వరరావు మాట్లాడారు. సర్వే నెంబర్ 18, 19లలో 30 ఎకరాల సీలింగ్ భూమి ఉందని, ఈభూములను కబ్జా చేసిన కొందరు అనుభవిస్తున్నారని, వాటిని ఇళ్ల స్థలాలు లేని పేదలకు పంపిణీ చేసేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కి వినతిపత్రం సమర్పించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం తాడువాయిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్టేషన్ రైటర్ పి.బాబురావు తెలిపిన వివరాల ప్రకారం దేవళ్ళ బాలాజీ ఈ నెల 5న తాడువాయిలో పెట్రోల్ బంకులో పెట్రోల్ కొట్టించుకుని మోటార్‌సైకిల్‌పై రోడ్డుపైకి వచ్చాడు. అదే సమయంలో జంగారెడ్డిగూడెం నుంచి అశ్వారావుపేట వెళుతున్న ట్రాలీ ఢీకొంది. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ఆసుపత్రిలో చికిత్స చేసి రాజమండ్రి తరలించారు. ప్రస్తుతం అక్కడ చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు ఆసుపత్రి నుంచి సమాచారం రాగా, అతని సోదరుడు అర్జున్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

యూరియా కొరతను నివారించాలి



జంగారెడ్డిగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

చింతలపూడి: యూరియా కొరతను నివారించాలని సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి మామిళ్ళపల్లి వసంతరావు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించిన అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్ షేక్ షకీలాకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ ప్రభుత్వం దూరదృష్టితో వ్యవహరించనందున యూరియా కొరత ఏర్పడిందని, దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి తొర్లపాటి బాబు, పుల్లూరి సోమశేఖర్, దొంతా కృష్ణ, కంచర్ల గురవయ్య, టీవీఎస్ రాజు, తొర్లపాటి రాజు తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: ఎరువుల కొరత నివారించి రైతులకు అవసరమైన ఎరువులు సరఫరా చేయాలని, ఎరువులు బ్లాక్ మార్కెట్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి జంపన వెంకటరమణ రాజు డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర వ్యాప్త పిలుపుమేరకు ఎరువుల కొరత నిరసిస్తూ సోమవారం సీపీఐ జంగారెడ్డిగూడెం మండల సమితి ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ స్లీవజోజికి అందజేశారు. సీపీఐ జంగారెడ్డిగూడెం మండల సహాయ కార్యదర్శి సుంకర రాధాకృష్ణ, కుంచె వసంతరావు, చందా త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరు: రైతులకు సరిపడా యూరియా ,ఎరువులు అందించాలని కోరుతూ సోమవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సీపీఐ నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కుక్కునూరు మండలంలోని రైతులు యూరియా కోసం అనేక పాట్లు పడుతున్నారని తెలిపారు. రెండు రోజుల క్రితం మన గ్రోమోర్ వద్ద యూరియా కోసం రైతులు వెళ్తే ఎఫ్20 ఎరువులను కొంటేనే యూరియా ఇస్తామని మండల వ్యవసాయశాఖాధికారి, గ్రోమోర్ నిర్వాహకులు తెగేసి చెప్పడం దారుణమన్నారు. అనంతరం కుక్కునూరు తహసీల్దార్ రమేష్‌బాబుకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ ధర్నాలో ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు మైసాక్షి వెంకటాచారి, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల, మండల కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య, కురాకుల బాబురావు, వెంకట్, ఉంగా, భీమా, శుక్లా తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

77 టన్నుల యూరియా కేటాయింపు

కుక్కునూరు: కుక్కునూరు మండలానికి మార్క్‌ఫెడ్, మనగ్రోమోర్‌ల ద్వారా 77 టన్నుల యూరియా కేటాయింపు జరిగినట్టు మండల వ్యవసాయశాఖాధికారి రెంటపల్లి బాలాజీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్క్‌ఫెడ్ యూరియాలో 12 టన్నులు శ్రీధరవేలేరు కు కేటాయించామన్నారు. ఈ యూరియాను మంగళవారం ఉదయం నుంచి రైతులకు పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. మండలానికి సంబంధించి మరో 75 టన్నుల యూరియా కావాలని ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు.

ఏరియా ఆసుపత్రి పారిశుద్ధ్య కార్మికుల ధర్నా

జంగారెడ్డిగూడెం: తమ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక ఏరియా ఆసుపత్రి పారిశుద్ధ్య కార్మికులు విధులు బహిష్కరించి ఏరియా ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచె వసంతరావు మాట్లాడుతూ ఏరియా హాస్పటల్ శానిటరీ వర్కర్లకు గత మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

బీసీ వసతి గృహాల సమస్యలు పరిష్కరించండి

కొయ్యలగూడెం: జిల్లాలో ఉన్న బీసీ వసతి గృహాల సమస్యలు పరిష్కరించాలని, కొయ్యలగూడెం పట్టణంలో ఉన్న బీసీ బాలుర వసతి గృహాన్ని పట్టణంలో కొనసాగించాలని ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షులు డి.శివకుమార్, కోశాధికారి ఎం.క్రాంతి కుమార్, ఏఐఎస్ఎఫ్ నాయకులు సిద్దు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు జిల్లా కలెక్టర్, బీసీ సంక్షేమ అధికారికి వినతి పత్రాలు పీజీఆర్ఎస్‌లో అందజేసినట్లు తెలిపారు.

హోమియో ఆసుపత్రికి శాశ్వత భవనం నిర్మించాలి

టి.నరసాపురం: మండల కేంద్రమైన టి నరసాపురంలో హోమియో ఆసుపత్రికి స్థలం కేటాయించి, భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సామాజిక కార్యకర్త ఎస్‌డీ నాసర్ పాషా కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ టి.సాయిబాబా, ఎంపీడీవో నగరాజ కుమారికి వినతి పత్రాలు అందజేశారు.

మార్కెట్ యార్డు పరిశీలన

జంగారెడ్డిగూడెం: ఎరువులు, యూరియా నిల్వలపై అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదని వ్యవసాయాధికారి పవన్‌కుమార్, జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర అన్నారు. వారు సోమవారం జంగారెడ్డిగూడెం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ను పరిశీలించారు. ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. జంగారెడ్డిగూడెం మండలంలో 120 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందని, అవసరమైన మేరకు రైతులు ఎరువులు వినియోగించుకోవాలన్నారు.